క్లుప్తంగా

నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్ సోమవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ చాంబర్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 0863-2224202 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. అనంతరం ప్రజల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను కౌన్సిల్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు వివరించారు.

పిల్లలకు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: స్థానిక తురకపాలెంరోడ్డులోని స్వర్ణాంధ్ర నగర్‌లో కేశవ స్మారక సమితి, గుంటూరు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రముఖ చిన్నపిల్లల వైద్యులు ఆళ్ల శ్రీకాంత్ రెడ్డి సేవలు అందించారు. చిన్న పిల్లల ఆరోగ్యం విషయంలో తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కేశవ స్మారక సమితి కార్యదర్శి చంద్రపాటి సుధాకర్ సమితి చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. సభ్యులు మునిపల్లె కృష్ణ మోహన్, చెరుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీయార్ కథలు పుస్తకావిష్కరణ



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ స్వామి కళావేదికపై ఆదివారం అజో విభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంగీత, నృత్య, సాహిత్య, నాటక సంస్థ సంయుక్తంగా ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన బీయార్ కథల పుస్తకావిష్కరణ సభ ఆదివారం జరిగింది. సభకు అజో విభో కందళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోష్యుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు గ్రంథాన్ని ఆవిష్కరించగా, ప్రముఖ నాటక రచయిత వల్లూరి శివప్రసాద్ గ్రంథ పరిచయం చేశారు. సంస్కృతి నిర్వాహకులు సత్రాజు బాలచందర్ రచయిత పుస్తకాన్ని కృతియిచ్చారు. సినీ నటుడు వైఎస్ కృష్ణేశ్వరావు పాల్గొనగా, రచయిత, ప్రముఖ సాహితీవేత్త ఆచార్య బేతవోలు రామబ్రహ్మంను సత్కరించారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: ఒంటరి జీవనం సాగించే వయోవృద్ధులు, దివ్యాంగులకు తమవంతుగా సహాయం అందించాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ అన్నారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ఆదివారం వయోవృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, 11 రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారాలతో సమితి ఏర్పడిన దగ్గర్నుంచి ప్రతినెల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉచిత బియ్యం కమిటీ చైర్మన్ పోలేపల్లి వెంకటసుబ్రహ్మణ్యం, ఎస్వీ రమణ, టి.మురళీసాయి, పలకలూరి శివరావు, పోలేపల్లి లహరి, లక్ష్మీకుమారి, అనురాధ, స్నేహిత, వల్లంపాటి రజనీశ్వరరావు పాల్గొన్నారు.


పేద వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం



గుంటూరు మెడికల్: నిరుపేద కుటుంబంలో పుట్టి డాక్టర్ కోర్సు చదివేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఓ వైద్య విద్యార్థికి గుంటూరుకు చెందిన వైద్యులు సాయం చేశారు. గుంటూరు నగరానికి చెందిన వైద్య విద్యార్థి ఆరేటి అనిల్ కుమార్, నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి గన్నవరంలోని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశాన్ని పొందాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న 'మా' స్కాన్ సెంటర్ అధినేత డాక్టర్ ఎం. ఆదినారాయణ, ప్రముఖ పిల్లల వైద్య వైద్యులు ఆలా వెంకటేశ్వర్లు, డాక్టర్ మహేష్, రిటైర్డ్ పోలీస్ అధికారి బాల వెంకటేశ్వరరావు, సామాజిక కార్యకర్త దాసరి తిరుపతిరావు ఆదివారం వైద్య విద్యార్థి చదువుకునేందుకు రూ.65 వేలు సహాయం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకి కాకూడదని దాతలు ఇటువంటి ప్రతిభావంతులను ఆదుకోవాలన్నారు. డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తల్లిదండ్రులు రోజువారి కూలీలైనప్పటికీ నీట్ పరీక్షలో అద్భుతమైన ప్రతిభ కనబరచి మెడికల్ సీటు సాధించిన అనిల్ కుమార్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఆర్థిక కష్టాల్లో ఉన్న తనను ఆదుకున్న దాతలకు అనిల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

లంగ్ క్యాన్సర్.. నిర్ధారణ కీలకం

- ఊపిరితిత్తుల అవగాహన ఉండాలి
- ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తిస్తే ప్రాణాలు కాపాడవచ్చు
- నవంబర్ నెల లంగ్ క్యాన్సర్ అవగాహన మాసం



ఊపిరి తిత్తుల క్యాన్సర్ పోస్టర్స్

గుంటూరు మెడికల్ : పెరుగుతున్న వాతావరణ కాలుష్యంతో నేడు ఊపిరితిత్తుల క్యాన్సర్ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయి. ప్రతిముగ్గురిలో ఒకరు లంగ్ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 2.02 మిలియన్ల మంది, మన దేశంలో 70వేల మంది ప్రతిఏడాది వ్యాధి బారిన పడుతున్నారు. వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది నవంబర్ నెలను లంగ్ క్యాన్సర్ అవగాహన నెలగా నిర్వహిస్తున్నారు.

వీరికి ఎక్కువ..

పొగతాగేవారికంటే వారి పక్కన ఉండే వారే ఎక్కువగా లంగ్ క్యాన్సర్ సోకుతోంది. ట్రాఫిక్ పోలీసులకు, టోల్‌గేట్ వద్ద పనిచేసే సిబ్బందికి, క్వారీలు, మైనింగ్, తారురోడ్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణాల పనుల్లో పాల్గొనేవారు వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువ. పొగతాగటం అలవాటు లేని ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల్లో 65 శాతం మంది మహిళలు, 35శాతం మంది పురుషులు ఉన్నారు.

రావటానికి కారణాలు...

ధూమపానం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం. లంగ్ క్యాన్సర్ మరణాల్లో 80శాతం సంభవించటానికి కారణం పొగతాగటమే. సిగిరెట్లు కాల్చటం, హుక్కా, గంజాయి పీల్చటం లంగ్ క్యాన్సర్‌కు దారితీస్తుంది. కాలుష్య పొగల కారణంగా, వాహనాల కాలుష్యం వలన, రేడియేషన్ వలన, వాతావరణ కాలుష్యం వలన ఊపిరితిత్తుల క్యాన్సర్లు వస్తున్నాయి.

బాధితులు ఇలా...

గుంటూరు జిల్లాలో 20 మంది పల్మనాలజిస్టులు, 30 మంది క్యాన్సర్ వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ఇరువురు లేదా ముగ్గురు బాధితులు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడి చికిత్స కోసం వస్తున్నారు.

వ్యాధి లక్షణాలు...

విడవకుండా దగ్గు రావటం, దగ్గులో రక్తం పడటం, కళ్లె పడటం, ఆకలి లేకపోవటం, ఛాతిలో నొప్పి, గొంతు బొంగురు పోవటం, ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే బరువు తగ్గిపోతుంటారు. లో ఫీవర్ తరచుగా వస్తుంది. ఎముకలు, కీళ్లు, వెన్ను, నడుం నొప్పి ఎక్కువ కాలం ఉండటం, శ్వాస సరిగా ఆడకపోవటం, శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడతారు. ఆయాసం, నిద్రలో గురకరావటం, తరచుగా జబ్బు బారిన పడటం లాంటి లక్షణాలు కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఊపిరితిత్తుల క్యాన్సర్‌గా భావించి వైద్యులను సంప్రదించాలి.

ఈ జాగ్రత్తలు పాటించండి....

ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే తొలుత పొగ తాగకూడదు. తాగే వారి పక్కన కూడా ఉండకూడదు. ప్రతిరోజూ కొద్దిపాటి వ్యాయామాలు చేయాలి. వారానికి ఐదు యాపిల్ పండ్లు తింటే ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడుతుంది. బీటా కెరోటిన్ పోషకాహారం తీసుకోవటం ద్వారా లంగ్ క్యాన్సర్ బారిన పడే ముప్పును తప్పించుకోవచ్చు.

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌లను గుర్తించేందుకు నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను లోడోస్ సీటీస్కాన్ స్క్రీనింగ్ పరీక్ష ద్వారా ఒక సెంటీమీటరు కన్నా తక్కువ సైజులో ఉన్న గడ్డలను సైతం నిర్ధారణచేయవచ్చు. క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించే ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్, క్రయో తొరకోస్కోపి, పెట్‌స్కాన్, సీటీస్కాన్ వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి.

డాక్టర్ బైరపనేని స్రవంతి,
క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు

వ్యాధి నిర్ధారణ చేయించుకోవాలి



వాతావరణ కాలుష్యం, ఆధునిక జీవనశైలి వలన లంగ్ క్యాన్సర్ కేసులు రోజురోజుకు పెరిగిపోతున్న దృష్ట్యా 40 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరూ ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. కుటుంబంలో ఒకరికి లంగ్ క్యాన్సర్ ఉంటే ఇతర కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ముందస్తు స్క్రీనింగ్ వైద్యపరీక్షలు చేయించుకోవడం చాలా ఉత్తమం. ఇతర క్యాన్సర్‌లు శరీరంలో సోకితే వారికి లంగ్ క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది. పలువురు వ్యాధి నిర్ధారణ సకాలంలో చేయించుకోవడం లేదు. వ్యాధి నిర్ధారణ చేసే సమయానికి క్యాన్సర్ మూడో దశలో ఉన్నట్లు గుర్తిస్తున్నాం. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందిస్తే వ్యాధి నుంచి విముక్తి కల్పించవచ్చు.

–డాక్టర్ బి.దుర్గాప్రసాద్, పల్మనాలజిస్ట్, గుంటూరు

ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు



అధికారులకు, సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ లోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియాన్ని స్థానిక వాకర్స్, నగరపాలక సంస్థ అధికారులతో కలసి పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియాన్ని క్రీడల హబ్‌గా, ఉదయం సాయంత్రం వాకింగ్ చేసుకునే వారికి ఆహ్లాదంగా, సమగ్ర మౌళిక వసతుల కేంద్రంగా తీర్చిదిద్దడానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టేబుల్ టెన్నిస్, షటిల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులను, పురుషుల, మహిళల జిమ్‌లను పరిశీలించి, ప్రతి రోజు ఆయా క్రీడలకు ఎంత మంది వస్తున్నారు, స్టేడియం సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్టేడియంలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కొన్ని చోట్ల స్లాబ్ పెచ్చులు ఊడిందని, గోడలు బీటలు వచ్చాయని, వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని చెప్పారు. జిమ్‌లో ఆధునాతన ఎక్విప్మెంట్ ఏర్పాటుకు, బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో లైట్లు, ఇతర అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్, ఏఈ చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి బాబు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నెహ్రూనగర్: క్రీడల ద్వారా చిన్నారుల్లో మానసిక, శారీరక ధారుడ్యం పెంపొందుతుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో స్కేటింగ్‌లో శిక్షణ పొందిన శ్రీవల్లి, గౌతమ్ విశ్వాస్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా వారిని కమిషనర్ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని, చిన్నారులను క్రీడలలో ప్రోత్సహించాలన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడల శిక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. వివిధ క్రీడల కోర్టుల మరమ్మతులు చేపట్టి, నిపుణులైన శిక్షకులతో శిక్షణ అందిస్తామన్నారు.

పాదాల సమస్యలు నిర్లక్ష్యం చేయొద్దు

డాక్టర్ రామలింగేశ్వరరావు



మాట్లాడుతున్న డాక్టర్ రామలింగేశ్వరరావు

గుంటూరు మెడికల్: మధుమేహ బాధితులు పాదాల సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని, ఆ చిన్న సమస్యలే ప్రమాదకరంగా మారి చివరకు కాలు లేదా వేళ్లు తొలగించాల్సిన పరిస్థితి వస్తుందని ప్రముఖ శస్త్ర చికిత్స వైద్యనిపుణులు కె.రామలింగేశ్వర రావు అన్నారు. బ్రాడీపేటలోని ఎస్ హెచ్ఓ సమావేశ మందిరంలో మధుమేహంపై శాస్త్రీయ అవగాహన సభ ,ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ రామలింగేశ్వర రావు మాట్లాడుతూ దీర్ఘకాల మధుమేహ బాధితులలో రక్తనాళాలు సన్నబడిపోవడం, రక్త సరఫరా సరిగ్గా జరగదని తెలిపారు. న్యూరోపతి వల్ల స్పర్శ నొప్పి తీవ్రత తెలియకపోవడం, రోగ నిరోధక శక్తి తగ్గిపోతాయని వివరించారు. ఫలితంగా చిన్న దెబ్బ తగిలిన గాయాలు పెద్దవి అవుతాయని, నొప్పి తెలియని కారణంగా మధుమేహ బాధితులు వాటినీ నిర్లక్ష్యం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆ గాయాలు ఇన్ఫెక్షన్ కు గురై అవి బాగా పెరిగిపోయి చీము పట్టి ప్రమాదకరంగా మారతాయన్నారు. ఎల్లప్పుడూ కాళ్లు వేళ్ల మధ్య తేమ లేకుండా చూసుకోవాలన్నారు. చెప్పుల విషయంలోనూ, గోళ్లు కత్తిరించే విషయాలలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలిన గాయాలైనావెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు. మధుమేహ బాధితులు రక్తంలో షుగర్ శాతం పూర్తిగా నియంత్రణలో ఉంచుకుంటూ, కాళ్లు పాదాలను జాగ్రత్తగా పరీక్షించుకోవాలని చెప్పారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడుతూ దేశంలో మన తెలుగు రెండు రాష్ట్రాల్లో మధుమేహం చాప కింద నీరులా వేగంగా వ్యాప్తి చెందుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శిబిరంలో దంత వైద్య నిపుణులు డాక్టర్ బి.చైతన్య, ఎస్‌హెచ్ఓ మేనేజర్ పి.నిర్మల రాణి మానవతా సచ్చంద సేవా సంస్థ సభ్యులు ఆలా అనంతరామయ్య, జి.లక్ష్మీనారాయణ, టి.వి.సాయిరాం, ఎస్.సాంబశివరావు, సి హెచ్.శివాజీ, లక్ష్మీ సామ్రాజ్యం పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధనలతో ఆధ్యాత్మిక



ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న వెంకటరామచంద్రశాస్త్రి

గుంటూరు మెడికల్: కార్తిక వన సమారాధనలతో ఆధ్యాత్మికతో పాటు సమష్టిగా ముందుకు వెళ్లాలనే భావన కలుగుతాయని ప్రముఖ రచయిత, ఆంధ్రభూమి పూర్వ ఎడిటర్ మార్తి వెంకట రామచంద్రశాస్త్రి అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గుంటూరు బ్రాడీపేట బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. రామచంద్రశాస్త్రి మాట్లాడుతూ సమితి చేపడుతున్న కార్యక్రమాలను ప్రశంసించారు. బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు రంగా వఝల లక్ష్మీపతి మాట్లాడుతూ పేద విద్యార్థిని, విద్యార్థులకు విద్యా పారితోషికాల అందజేయడంతో పాటు పిల్లలకు ఉచితంగా ఉపనయనాలు చేస్తున్నట్టు వివరించారు. భవన పునర్నిర్మాణ ప్రత్యేక సంచిక ముఖ్యఅతిథితో ప్రారంభించారు. కార్తిక దామోదర పూజ మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. పిల్లలకు, పెద్దలకు ఆటలు, తంబోలా తదితర పోటీలు పెట్టారు. స్వరరాగ సుధ కె.వి. సాయిబాబా శర్మ, ఆర్‌పీఎల్ నరసింహారావు గాత్రకచేరి జరిగింది. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి కార్యదర్శి తుళ్లూరు ప్రకాష్, ఉపాధ్యక్షుడు ఆదిరాజు శ్రీధర్, గొల్లపూడి రామకష్టారావు, కర్లపాలెం బాలకృష్ణ, ప్రోగ్రాం కన్వీనర్ నందిరాజు పాండురంగారావు, కార్యవర్గ సభ్యులు జీవీఎల్ఎస్ సంజీవరావు, ఎం.కోదండ రామారావు, కే సీతా రమేష్, ఎం.వెంకటకృష్ణ, పి.మురళీమోహన్, బి.కృష్ణ ప్రసాద్, పి.శ్రీనాథ్, ఎం.మారుతి రామ్ గోపాల్, ఎం.రామకృష్ణ పరమహంస, కే సాయిబాబా శర్మ, ఎస్.రవికుమార్, ఎం.దివాకర్ శర్మ, బి.ప్రసాద్, కే పాంచజన్య శర్మ, ఏ మంగాదేవి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ సీసీ కెమెరాల డేటా చోరీపై కేసు

లక్ష్మీపురం: నగరంలోని అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల డేటాను చోరీ చేసి ఓ విలేకరికి ఇవ్వడంతో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఘటనలో స్టేషన్ ఎస్ఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు నగరంలోని పోలీస్ స్టేషన్లు, ఎస్పీ కార్యాలయంలో సీసీ కెమెరాలు, ఇంటర్‌నెట్ కనెక్షన్లు సర్వీస్ అరండల్‌పేటకు చెందిన శేషు అందిస్తుంటాడు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల డేటాను చోరీ చేశాడు. ఆ డేటాలో ఇటీవల బోరుగడ్డ అనిల్ కేసులో రాజమండ్రి నుంచి మూడు రోజుల పోలీస్ కస్టడీకి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో బోరుగడ్డ అనిల్ పోలీస్ స్టేషన్‌లో బల్లపై దుప్పట్లు వేసుకుని విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె.శ్రీనివాసరావు అక్కడే ఉండటం, ఉన్న డేటా ఓ పత్రికలో విలేకరిగా పని చేసే వ్యక్తికి శేషు ఇచ్చాడు. దాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో రెండు రోజులుగా బోరుగడ్డ అనిల్‌కు రాచమర్యాదలు చేస్తున్న అరండల్‌పేట పోలీసులు అనే కథనాలు వచ్చాయి. దీంతో రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శనివారం రాత్రి అరండల్‌పేట సీఐ శ్రీనివాసరావును వీఆర్‌కు పిలిచారు. ఇదిలా ఉంటే డేటా చోరీ చేసిన విషయంపై అరండల్‌పేట ఎస్ఐ రోజాలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల టెక్నీషియన్ శేషు, ఓ దినపత్రికలో విలేకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదకాకాని శివాలయంలో కార్తిక శోభ



పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం కార్తికమాసం భక్తులతో కళకళలాడింది. ఆలయ ప్రాంగణం కార్తిక దీపాల కాంతుతో దేదీప్యమానంగా దర్శనమించింది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో భక్తుల సందడి ప్రారంభమైంది. ఆలయ ప్రాంగణంలోని యజ్ఞాల బావి నీటితో స్నానాలు చేసిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం అంతటా ఓం నమఃశివాయ నామంతో మార్మోగింది. వివిధ సేవా కార్యక్రమాలు, ప్రసాద విక్రయాల ద్వారా స్వామికి రూ.6,00,000 ఆదాయం సమకూరినట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ కేవీ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యతో తొగట వీర క్షత్రియుల అభివృద్ధి



దివ్యజ్ఞానానందగిరి స్వామీజీకి సత్కారం

నగరంపాలెం: సృష్టి ఆరంభం నుంచి చారిత్రక నేపథ్యం కలిగిన తొగట వీర క్షత్రియులు చేనేత పని ద్వారా ఖండంతరాల ఖ్యాతిని తెచ్చుకున్నారని కుల గురువులు దివ్యజ్ఞానానందగిరి స్వామీజీ అన్నారు. తొగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో తొగట వీర క్షత్రియుల కార్తిక వన సమారాధన ఆదివారం రామక్షేత్రం ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్య ద్వారానే ఆర్థిక ఎదుగుదలతో పాటు రాజకీయ హక్కులను సాధించుకోవచ్చునని అన్నారు. జిల్లా అధ్యక్షులు అనంత మల్లికార్జున మాట్లాడుతూ గత 14 ఏళ్లుగా తొగటవీర క్షత్రియుల సమాజ ఐక్యత కోసం కార్తిక వనసమారాధనతో పాటు పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం దివ్యజ్ఞానానందగిరిస్వామీజీని సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షులు మోడెం వీరాంజనేయప్రసాద్, మాజీ అధ్యక్షులు కె.నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మిశెట్టి కృష్ణమూర్తి, రాష్ట్ర ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ జాయింట్ డైరెక్టర్ సిద్ధనాదం సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజల అర్జున్, గౌరవాధ్యక్షులు నలమాల భాస్కరరావు, వెనిగండ్ల కోటేశ్వరరావు, కనిగిరి రామారావు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి



సంతకాల సేకరిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని సామాజిక వేత్త డాక్టర గొల్లమూడి రాజసుందరబాబు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు మద్దు ప్రేమజ్యోతిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పలు చర్చిల్లో దళిత క్రైస్తవుల నుంచి సంతకాల సేకరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1950వ సంవత్సరంలోనే ఎస్సీలకు రిజర్వేషన్లు ఇవ్వకుండా చేయడానికే రాష్ట్రపతి ఉత్తర్వులు అంటూ ఒక ఉత్తర్వులను రాజ్యాంగ విరుద్ధంగా ఆనాటి కేంద్ర పాలకులు జారీ చేశారని గుర్తు చేశారు. క్రైస్తవ మతం తీసుకున్న ఎస్సీ కులాలకు ఇచ్చే రిజర్వేషన్లుకు అర్హత లేకుండా చేశారని చెప్పారు. 74 సంవత్సరాలు నుంచి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్రంతో నిరంతరం పోరాడుతూనే ఉన్నా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. తొలుత వెస్ట్ పారిస్ చర్చిలో ప్యారిస్ పాస్టర్ సతీష్ బాబు సహకారంతో ఒక సర్వీస్ లోనే 500 మంది సంతకాలు, నార్త్ ప్యారిస్ చర్చిలో బిషప్ బాబూరావు సహకారంతో 2,000 మంది సంతకాలు సేకరించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఈ నెలలో కేంద్రం నుంచి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ కమిషన్ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే విషయంలో పరిశీలన నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రానున్న నేపథ్యంలో 10 వేల సంతకాలు సేకరించి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇద్వా నాయకులు కోరబండ కేజియా వేల్పూరి మేరి రాణి, సుప్రియ ఇద్వా సంఘ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొప్పన ఆత్మీయ పురస్కారాలు ప్రదానం



ఆత్మీయ పురస్కారాలు ప్రదానం

నగరపాలెం: గుమ్మడి శ్రీమన్నారాయణ కళాసమితి, వైకే నాగేశ్వరరావు కళాపరిషత్ సంయుక్తంగా కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్‌లో నిర్వహిస్తోన్న నాటకోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో బొప్పన ఆత్మీయ పురస్కార సభ నిర్వహించారు. ఎల్‌వీఆర్ క్లబ్ అధ్యక్షులు మైనేని బ్రహ్మస్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి అధ్యక్షత వహించారు. అనంతరం బొప్పన నరసింహారావు ఆత్మీయ పురస్కారాలను ప్రముఖ రంగస్థల నటులు చలసాని కృష్ణప్రసాద్(విశాఖపట్నం), ఎస్ఎం బాషా(నరసరావుపేట), రంగస్థల నటులు దేవిరెడ్డి రామకోటేశ్వరరావులకు అందజేసి సత్కరించారు. అనంతరం మైత్రి కళా నిలయం(విజయవాడ) మాడుగుల రామకృష్ణ రచనలో టీవీ పురుషోత్తం దర్శకత్వం వహించిన బంధం సాంఘిక నాటిక సందేశాత్మకంగా కొనసాగింది. బత్తినేని సుభాష్ రచన దర్శకత్వంలో ఓరి వీళ్ల నటన పాడుగాను ఆడిషన్స్ స్కిట్ ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో డి.తిరుమలేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, జానీబాషాలు పాల్గొనగా, అతిథులను కళాకారులను సత్కరించారు.

ఘనంగా బాల కళా ప్రభ సాంస్కృతికోత్సవాలు ప్రారంభం



బాలకళా ప్రభ ప్రారంభోత్సవంలో అతిథులు

గుంటూరు ఎడ్యుకేషన్: బాలనంద కేంద్రం ఆధ్వర్యంలో రుద్ర కళాక్షేత్రం సహకారంతో చిన్నారుల్లో దాగి ఉన్న సాంస్కృతిక లలిత కళలను ప్రోత్సహిస్తూ నిర్వహిస్తున్న 'బాల కళా ప్రభ' సాంస్కృతికోత్సవం ఆదివారం కృష్ణనగర్ లోటస్ ఆద్య పాఠశాలలో ప్రారంభమైంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన చిన్నారులతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. మూడో తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులు చిత్ర లేఖనం, తెలుగు పద్యం, సంస్కృత శ్లోకం, జానపద, శాస్త్రీయ సంగీతం, నృత్యాలు, తెలుగులోనే మాట్లాడుకుందాం, జానపద దేశభక్తి గీతాల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నటరాజ స్వామికి పూలమాలవేసి, జ్యోతి ప్రజ్వలన గావించిన అనంతరం కార్యక్రమాలను ప్రారంభించిన బాలానంద కేంద్రం అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ దాదాపుగా ఏడు దశాబ్దాలుగా చిన్నారుల్లో దాగి ఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికి తీసేందుకు బాలానంద కేంద్రం కృషి చేస్తోందన్నారు. చదువుతో పాటు జీవన నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, ఆత్మ నిర్భరం వంటి అనేక అంశాల్లో వారు మానసిక దారుఢ్యం గా ఎదిగేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి నడింపల్లి గురుదత్, సహాయ కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి జి.సంధ్య శ్రీ, అకడమిక్ సలహాదారు వై.ఉమా, లోటస్ ఆద్య డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు, రుద్ర కళాక్షేత్రం కార్యదర్శి మాచిరాజు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట పరిధిలో పోలీసుల వారధి కార్యక్రమం



పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాద్రిపేటలో ఆదివారం వారధి కార్యక్రమన్ని నిర్వహించారు. కొత్తపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఎం.వీరయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. పూర్తిస్థాయిలో స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మద్యం బాబులు, గంజాయి మత్తులో కొంతమంది ఆగడాలు పాల్పడుతున్నారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మరింత భద్రత పెంచుతామని ఎస్‌హెచ్‌ఓ వీరయ్య హామీ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలకు బలికాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎటువంటి సమస్య వచ్చిన నేరుగా కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

మంత్రి పెమ్మసానిపై కార్యకర్త అసహనం

గుంటూరు వెస్ట్: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌పై ఓ టీడీపీ అభిమాని అసహనం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంకు వచ్చిన ఆయన కార్యకర్తలు మాట్లాడుతుండగానే ఫ్లైట్‌కు టైమ్ అవుతుందని వెళ్లిపోవాలని బయలుదేరారు. ఓ కార్యకర్త లేచి తమకు కనీసం సమయం కేటాయించలేదని వాపోయారు. వచ్చిన ప్రతిసారి అతి తక్కువ సమయమే కార్యాలయంలో ఉంటున్నారని, ఇలా అయితే పార్టీ జెండా మోసిన వారి కనీస సమస్యలను వినేది ఎవరు అని ప్రశ్నించారు. కాసేపటికి సర్ది చెప్పడానికి ప్రయత్నించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే విజయానికి కృషి చేసిన కార్యకర్తపై స్థానిక నాయకులు దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదులొచ్చాయి.